రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కృష్ణారెడ్డి

బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణారెడ్డి

బండ్లగూడ, మే 8. రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కృష్ణారెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ డిపో మేనేజర్‌గా పని చేస్తూ వేణుగోపాల్ హైదరాబాద్ వన్‌డిపోకు బదిలీపై వెళ్లారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

'అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి'

బండ్లగూడ,మే 8: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని హరీశ్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండిపేట మండల పరిధిలోని గంధంగూడలో సర్వేనెంబర్ 62లో అక్రమ నిర్మాణాలు బహుళ అంతస్తులు వెలుస్తున్నాయని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వేణుగోపాల్ రావుకు డాక్టరేట్

కాచిగూడ, మే 8: అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎన్.గోపాల్ రావు సేవింగ్స్ బిహేవియర్ ఆఫ్ అర్బన్ హౌస్ హోల్డింగ్ అనే అంశంపై క్షేత్రస్థాయిలో పరిశోధన చేసినందుకు కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఓయూ ప్రొఫెసర్ బి. సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో వేణుగోపాల్‌రావు పీహెచ్‌డీ పూర్తి చేశారు. గత 25 ఏళ్లుగా కళాశాలలో అధ్యాపకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్‌రావు డాక్టరేట్ అందుకున్న శుభ సందర్భంగా గురువారం కళాశాల అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్, హెచ్ ఓడీ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించి సత్కరించారు.

మహా నగరం

అందాల పోటీలకు వేదిక
చెత్తకు నిలయం

ఓ పక్క అందాల పోటీలకు హైదరాబాద్ వేదిక కాగా..మరోపక్క మహానగరంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తున్నది... వారం రోజులు గడుస్తున్నా..తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు సంబంధిత అధికారులు.. ఖైరతాబాద్‌లోని వెంకటరమణాకాలనీలో కొందరు చెత్తాచెదారాన్ని రోడ్డుపక్కనే పారవేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అటు నుంచి వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి వీధుల్లో చెత్త డంపింగ్ కాకుండా చూడాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.-ఖైరతాబాద్.

రెండు గంటల్లో ..5 మొబైల్ స్నాచింగ్స్

నిందితులను అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు

మొబైల్ ఫోన్ స్నాచర్ల వివరాలను వెల్లడిస్తున్న బంజారాహిల్స్ డీఐ మధుసూదన్

బంజారాహిల్స్, మే 8: జల్సాల కోసం రోడ్డుమీద వెళ్తున్న వ్యక్తులవద్ద మొబైల్ ఫోన్లు లాక్కెళ్తున్న ఇద్దరు పాత నేరస్థులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు గంటల వ్యవధిలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 5 చోట్ల మొబైల్ ఫోన్లు తస్కరించినట్లు విచారణలో తేలింది. గురువారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. హబీబ్‌నగర్ పీఎస్ పరిధిలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న నసీర్‌ఖాన్ అలియాస్ నజీర్(24) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇర్ఫాన్ ఖాన్ అలియాస్ అర్బాజ్ (30) స్నేహితులు. వీరిద్దరూ గంజాయి సేవించడంతో పాటు మద్యానికి అలవాటు పడి మొబైల్ ఫోన్ల చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ప్రణాళిక ప్రకారం గత నెల 30న అర్ధరాత్రి దాటిన తర్వాత వీరిద్దరూ ఓ బైక్ చోరీ చేసి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 1లో కాపుకాశారు. రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్తున్న మణిపూర్‌కు చెందిన మాంగ్‌క్యా హావ్‌కిప్(21) అనే వ్యక్తి వద్దనుంచి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితులు నసీర్‌ఖాన్, ఇర్ఫాన్ ఖాన్‌లను అరెస్ట్ చేసి విచారించగా వారిద్దరూ అదే రోజు రాత్రి రెండు గంటల వ్యవధిలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో 5సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేశారని విచారణలో గుర్తించారు. నసీర్‌ఖాన్‌పై గతంలో నగరంలోని పలు పీఎస్ పరిధిలో 16 కేసులు , ఇర్ఫాన్‌ఖాన్ మీద 6 కేసులు ఉన్నాయని తేలింది. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి వద్దనుంచి నాలుగు సెల్‌ఫోన్లు, హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

డ్రైనేజ్ పైప్ లైన్ల పరిశీలన

డ్రైనేజీ లైన్ల నిర్మాణం కోసం జలమండలి అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శరత్ చంద్ర

బండ్లగూడ, మే 8: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వైష్ణవి వైయాసిస్ వద్ద జలమండలి అధికారులు డి ప్యూటీ జనరల్ మేనేజర్ సౌర్యారెడ్డితో కలిసి కమిషనర్ శరత్‌చంద్ర డ్రైనేజీ లైన్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వర్షాలు కురిసినప్పుడు వైష్ణవి వైయాసిస్ ప్రాంతాల నుంచి నీరు చేరుకొని పెద్ద ఎత్తున డ్రైనేజీ లైన్లు పొంగి పొర్లుతున్నాయన్నారు. దీం తో ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం జలమండలి అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదయ్య తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నందిముస్లాయిగూడ సాయినగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్

మైలార్‌దేవ్‌పల్లి, మే 8: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తమవంతు బాధ్యత వహిస్తున్నామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. గురువారం అత్తాపూర్ డివిజన్ నందిముస్లాయిగూడ సాయినగర్‌లోని రాముని గుడి నిర్వహించే సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మొత్తం రూ.7.85 లక్షలతో సీసీ రోడ్డు పనులను నిర్వహిస్తున్నామన్నారు. గోతులమయంగా మారిన రోడ్లను అధునాతన పద్ధతిలో అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తేనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్, వాసు, వెంకట్‌రెడ్డి, రాజు, విజయ్, స్వామి, శశికాంత్‌శర్మ, గణేష్, రాంబాబుగౌడ్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

రంగారెడ్డి జిల్లా విద్యాధికారి శుశింధర్‌రావు

విద్యార్థుల తల్లిదండ్రులు ,ఉపాధ్యాయులతో చర్చిస్తున్న డీఈవో శుశింధర్‌రావు, తదితరులు

శంషాబాద్ రూరల్, మే 8 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి శుశింధర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం శంషాబాద్ మున్సిపాలిటీలోని శాతంరాయిలో ఇంటింటికీ తిరుగుతూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా తల్లిదండ్రులను ఒప్పించిన ఉపాధ్యాయులను అభినందించారు. రెండు రోజులుగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు దాదాపు 200 మంది విద్యార్థుల తల్లిదండ్రులను ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులను ఒప్పించినట్లు పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంషాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి,వెంకటయ్య, లక్ష్మారెడ్డి,స్థానిక నాయకుడు జల్లపల్లి నరేందర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహవీర్ కళాశాలలో .. ఉచిత కంటి వైద్య శిబిరం

మైలార్‌దేవ్‌పల్లి, మే 8: కంటి సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సింగ్స్ ఐవేర్, చంద్రశేఖర్ ఆజాద్ ఆప్టామెట్రిస్ట్ ఆధ్వర్యంలో మహవీర్ కళాశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు, కండ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం సంరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషాశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వీరేంద్రపాటిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహవీర్ కళాశాలలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరంలో పాల్గొన్న అధ్యాపకులు తదితరులు

సెంట్రింగ్ కార్మికులకు సహకరించాలి

సెంట్రింగ్ కార్మికులకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

శంషాబాద్ రూరల్, మే 8 : భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ రంగం కీలకం ఆ రంగం కార్మికులకు అన్ని వర్గాల నుంచి మద్దతు వస్తుందని ప్రజాప్రతినిధులు సైతం తమకు సహకరించాని కోరుతూ గురువారం ఎమ్మెల్యే ప్రకశ్ గౌడ్‌ను శంషాబాద్ మండల సెంట్రింగ్ కార్మికుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశామని కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో పాటు ఇతర ఖర్చులు పెరిగాయి. కాని సెంట్రింగ్ రంగ కార్మికుల ధరలు చాలా తక్కువగా ఉండడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.
తమకు ధరలు పెంచాలని ఆందోళన చేస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసి మద్దతు కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్మికుల సంఘం అధ్యక్షుడు చంద్రయ్యముదిరాజ్‌తో పాటు పలువురు కార్మికులు ఉన్నారు.

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిసేబులిటీస్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అలీ యావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిసేబులిటీస్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ కేంద్రం 2025-26 విద్యా సంవత్సరానికి బీఏఎస్ఎల్పీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ), ఎంఎస్సీ (ఆడియాలజీ) కోర్సులతోపాటు డిప్లొమా స్థాయి కోర్సులను సైతం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చేనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలను ప్రవేశపరీక్షలో ప్రతిభ ఆధారంగా నిర్వహిస్తామని వివరించారు. ఇతర వివరాలకు www.ayjnishd.nic.inలో చూసుకోవాలని పేర్కొన్నారు.

ఎంపీఈడీ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంపీఈడీ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

కాచిగూడ, మే 8: 18 సంవత్సరాలలోపు మైనర్లు ద్విచక్రవాహనాలను ఎట్టి పరిస్థితులలో నడపరాదని కాచిగూడ ట్రాఫిక్ సీఐ ఏ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నింబోలిఅడ్డాలో మైనర్లపై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు మైనర్లను దృష్టిలో పెట్టుకొని వాహనాలు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు. మైనర్లు రోడ్లపై ఇష్టానుసారంగా అతివేగంగా రాంగ్ రూట్లలో వాహనాలు నడుపుతూ ఇతర వాహనాలను ఢీకొడుతూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఒక నెలలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లపై 47 కేసులు నమోదు చేసినట్లు... అందులో 4 వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మైనర్లు వాహనాలు నడుప వద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కె.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వెంగళరావునగర్,మే 8:గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మధురానగర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై సాయి కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట మైత్రీవనం కూడలి వద్ద పిల్లర్ నంబర్ ఎ1050 పక్కన పుట్‌పాత్ పై గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్ల స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని పరీక్షించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు.దీంతో మృత దేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇతని వివరాల తెలిసిన వారు మధురానగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పలు కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లమో ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలతో పాటు ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

భారత సైనికులకు అండగా ఉందాం

వెంగళరావునగర్, మే 8 : పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ లోని శత్రు స్థావరాల్లో ఉగ్ర శిబిరాలపై విరుచుకుపడుతూ మన భారత జవాన్లు వీరోచితంగా పోరాటం చేస్తున్నారని..మన భారత జవాన్లకు అండగా ఉండాలని వినియోగదారుల ఫోరం జాతీయ కార్యదర్శి పి.వి. రవిశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం తన నివాసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆపరేషన్ సింధూర్‌పై ఆయన స్పందించారు.తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేసేందుకు సైనికులు పోరాడుతున్నారని పేర్కొన్నారు.

సిబిల్ స్కోర్ నిబంధన తొలగించాలి

హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో నిరసన చేసున్న ఏఐవైఎఫ్ నేతలు

హిమాయత్‌నగర్,మే 8: రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్‌ను కీలకం చేయడం సరికాదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. సిబిల్ స్కోర్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద చెవిలో పూలు, చేతిలో చిప్పను పట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాజీవ్ యువ వికాసానికి 16.25 లక్షల మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు అనంతరం ఇప్పుడు కొత్తగా సిబిల్ స్కోర్ తప్పకుండా ఉండాలనే నిబంధనతో లక్షల మంది యువత ఈ పథకానికి దూరమయ్యే అవకాశం ఉంద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిబిల్ స్కోర్ ఆలోచన విధానాన్ని విరమించుకోవాలన్నారు. ఎటువంటి నిబంధనలు పెట్టకుండా అందరికి ఉపాధి కల్పన కోసం ఈ స్కీమ్‌తో రుణాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు నెర్లకంటి శ్రీకాంత్, టి.సత్యప్రసాద్, షేక్ మహమూద్, మాజీద్ అలీ ఖాన్, హేమంత్, జానీ, వెంకట్, ఖాజా పాషా, సతీశ్ కుమార్, జగన్, సీపీఐ నేత చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు మద్దతు ఇవ్వాలి

- ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రపంచ దేశాలు ముందుకురావాలి

భారత దళాలకు మద్దతుగా అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

కవాడిగూడ, మే 8: ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రపంచ దేశాలు భారత్‌కు మద్దతు ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. పాకిస్థాన్ భూభాగంలో ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసిన భారత త్రివిధ దళాల ధైర్యానికి ఆయన వందనా లు తెలిపారు. గురువారం ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారత సాయుధ దళాలకు సంఘీభావంగా ఆప్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ మన దళాల ధైర్యం ప్రతి భారత పౌరుడి విశ్వాసమని, ఆపరేషన్ సిందూర్ విజయమని అన్నారు. పాకిస్తాన్ ఉగ్ర కర్మాగారాలను అంతం చేయడానికి కేంద్రం తీసుకున్న చర్యలకు ఆప్ పూర్తి మద్దతు తెలుపుతుందని చెప్పారు. జాతీయ భద్రతపై ఎలాంటి రాజీ పడొద్దని, ఇది అత్యంత ముఖ్యమైన అంశమని అన్నారు. ఉగ్రవాదులను నాశనం చేయడానికి అన్ని దేశాలు భారత్‌తో చేతులు కలిపి ప్రపంచంలో శాంతియుత వాతావరణం ఏర్పాటు చేసేందుకు బలంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆప్ నేతలు జావీద్ షరీఫ్, డాక్టర్ లక్ష్మీనాయుడు, సుధారాణి, అజీజ్‌బేగ్, షాబాజ్, సిద్దార్థ్ ఎస్ ఎన్ రెడ్డి, రమ్యగౌడ్, విశా లి, లియాఖత్ ఖాన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే స్వచ్ఛ సర్వేక్షణ్..

కవాడిగూడ, మే 8: స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించేందుకు వచ్చిన జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులను పద్మశాలి కాలనీవాసులు నిలదీశారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, ఎస్ ఎఫ్ఏలు గురువారం కాలనీవాసులకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్త వేయరాదని కోరారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు సుందర్ పటాలే, కార్యదర్శి ఆంజనేయులు శానిటరీ సూపర్‌వైజర్‌ను నిలదీశారు. పేరుకే స్వచ్ఛ సర్వేక్షణ్ రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించరా అని ప్రశ్నించారు. భోలక్‌పూర్, పద్మశాలికాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా రోడ్లపై చెత్త చెదారం దర్శనమిస్తోందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా కాకుండా పటిష్టంగా అమలు చేయాలన్నారు. రోడ్లు, కాలనీల్లో చెత్త పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను డిమాండ్ చేశారు. కాలనీవాసులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

అడ్డగుట్ట: మెట్టుగూడ డివిజన్ పరిధిలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత సూచించారు. గురువారం మెట్టుగూడ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఏఈ సజద, అధికారులతో కార్పొరేటర్ రాసూరి సునీత సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీత అధికారులకు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

మెహిదీపట్నం : మెహిదీపట్నం డిపో ప్రాంత ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి తగు సూచనలు, సలహాల గురించి, ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను తెలుసుకొనుటకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 11:00 నుంచి 12:00 గంటల వరకు మీ సూచనలు.. సలహాలు అభిప్రాయాలను తెలియజేయాలని డిపో మేనేజర్ బీవీకే మూర్తి తెలిపారు. వివరాలకు 99592 26133లో సంప్రదించాలన్నారు.

విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్,మే 8: అక్రమంగా విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. టోలీచౌకి లోని జేకే టవర్స్ ఎదురుగా ఉన్న స్టార్ లైట్ పాన్‌షాప్‌లో విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు సోదాలు నిర్వహించారు. షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పలు విదేశీ బ్రాండ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పాన్‌షాపు నిర్వాహకుడు తాహెర్ అలీ బేగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెట్రోల్ పోయించుకుని ఉడాయించిన యువకులు

బంజారాహిల్స్,మే 8: పెట్రోల్ పోయించుకుని బిల్లు చెల్లించకుండా ఉడాయించిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 5లోని దేవరకొండ బస్తీలో నివాసం ఉంటున్న అనికేత్ కుమార్(23) అనే యువకుడు బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని ఆస్కి పక్కనున్న పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తుంటాడు.

ఈనెల 4న ఉదయం 4గంటల ప్రాంత